www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 24 డిసెంబర్ 2024

5

పశ్చిమ గోదావరి

## వాహనదారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు

### జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి

**భీమవరం టౌన్:**వాహనదారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల మరణిస్తున్నారని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి తెలిపారు. సోమవారం శ్రీవిజ్ఞానవేదిక, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌పి కార్యాలయంలో హెల్మెట్ అవగాహన పోస్టర్‌ను ఎస్‌పి ఆవిష్కరించి మాట్లాడారు. జీవితం చాలా విలువైందని, హెల్మెట్ ధరించి సురక్షితంగా ఉండాలని సూచించారు. హెల్మెట్ ధరించడంపై ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి సహకారంతో ఈ ప్రచార అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, కచ్చితంగా హెల్మెట్ ధరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల గురించి పట్టించుకునే నాధుడే లేకపోయాడు. రోగుల గురించి ఏమాత్రం ఆలోచన చేయకుండా ఉన్న ఒక్క న్యూరోసర్జన్‌ను వేరే చోటకు బదిలీ చేయడంతో యాక్సిడెంట్, అత్యవసర రోగుల కోసం ఏర్పాటు చేసిన 'ట్రామాకేర్ ఐసియు' మూతపడటంతోపాటు, ఓపి సేవలు తగ్గిపోవడం, స్కానింగ్‌ల సంఖ్య పడిపోయినా జిల్లా ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టర్ దృష్టి సారిస్తేనే ఏలూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సేవలు గాడిన పడే అవకాశం ఉందని పలువురు ఘంటాపథంగా చెబుతున్నారు.

# ఇదేం సర్వజన ఆసుపత్రి..!

- న్యూరో సర్జన్‌ను పంపేసి ట్రామాకేర్ ఐసియు మూత
- యాక్సిడెంట్, అత్యవసర రోగుల పరిస్థితి అగమ్యగోచరం
- న్యూరో సేవలు లేక తగ్గిన ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్‌లు
- రోజువారీ ఓపి సేవలు 1500 నుంచి 900కు పతనం
- కలెక్టర్ పట్టించుకోకపోవడమే కారణమని విమర్శలు

న్యూరోసర్జన లేకపోవడంతో రోగులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న ట్రామాకేర్ ఐసియు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలతోపాటు తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఏలూరు సర్వజన ఆసుపత్రికి రోగులు వస్తుంటారు. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు వైద్యసేవల్లో ప్రఖ్యాతిగాంచిన ఆసుపత్రి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా మారిన తర్వాత పరిస్థితి అధ్వానంగా మారిందని చెప్పొచ్చు. నేషనల్ హైవేపైనా, మరెక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే రెండు జిల్లాలవ్యాప్తంగా ఏలూరు సర్వజన ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేస్తారు. అత్యవసర కేసుల కోసం 2010లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ట్రామాకేర్ ఐసియు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటైంది. ట్రామాకేర్ ఐసియులో సామాన్య రోగుల కోసం పది బెడ్స్, విఐపిలకు రెండు బెడ్స్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. ప్రతిరోజూ అత్యవసర కేసులు 20కిపైగా ఈ ఆసుపత్రికి వస్తుంటాయి. యాక్సిడెంట్ కేసుల్లో తలకు దెబ్బలు తగిలి, నరాలకు సంబంధించిన కేసులే అత్యధికంగా ఉంటాయి. ట్రామాకేర్ ఐసియు ఎక్కువగా న్యూరోసర్జన్‌పై ఆధారపడి ఉంటుంది. సర్వజన ఆసుపత్రిలో ముగ్గురు న్యూరోసర్జన్లను నియమించుకునే అవకాశం ఉన్నప్పటికీ నెల క్రితం వరకూ న్యూరో విభాగంలో డాక్టర్ రవికుమార్ మాత్రమే ఉండేవారు. కొత్త వైద్యులను నియమించకపోగా ఉన్న న్యూరో డాక్టర్‌ను బదిలీ చేయడం గమనార్హం. వైసిపి ప్రభుత్వంలోనూ ఇలాగే జరిగితే అప్పటి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జోక్యం చేసుకుని ఉన్నతాధికారులను ఒప్పించి న్యూరోడాక్టర్ కొనసాగేలా చేశారు. నెలక్రితం మరోసారి న్యూరో వైద్యునితోపాటు ఇతర వైద్యులను బదిలీ చేశారు. దీంతో సర్వజన ఆసుపత్రిలో న్యూరోసేవలు పూర్తిగా నిలిచిపోయాయి. అత్యవసర కేసులు చూసే న్యూరో సర్జన్ లేకపోవడంతో ట్రామాకేర్ ఐసియు మూతపడింది. యాక్సిడెంట్, అత్యవసర కేసులను విజయవాడకు రిఫర్ చేస్తున్న పరిస్థితి ఉంది. దీంతో రోగులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య సైతం తగ్గిపోయింది. ముఖ్యంగా మంచానికే పరిమితమైన రోగులకు ఎన్‌టిఆర్ భరోసా కింద ప్రభుత్వం రూ.15 వేలు పింఛన్ ఇస్తోంది. అలాంటి రోగులకు మెడికల్ సర్టిఫికెట్ జారీ చేయాలంటే న్యూరోసర్జన్ తప్పనిసరి. ఆ వైద్యుడు లేక నెల రోజులుగా మెడికల్ సర్టిఫికెట్లు జారీ సైతం ఆగిపోయినట్లు చెబుతున్నారు.

సోమవారం సైతం రోగుల తాకిడి లేని ఓపి కేంద్రం

**రోగుల అవస్థలు వర్ణనాతీతం**

ఏలూరు సర్వజన ఆసుపత్రికి ప్రతిరోజూ వందకుపైగా న్యూరో సంబంధిత రోగులు వచ్చేవారు. న్యూరోసర్జన్ లేకపోవడంతో రోగులు సర్వజన ఆసుపత్రికి రావడం లేదు. గతంలో ప్రతిరోజూ 1500 వరకూ ఓపి ఉండగా న్యూరో డాక్టర్ లేకపోవడం, ఇతర సీనియర్ డాక్టర్లను బదిలీ చేయడంతో ఓపి సేవలు 900కు పడిపోయినట్లు సిబ్బంది మాటల్లో తెలుస్తోంది. ఎంఆర్ఐ, సిటీస్కానింగ్‌లు ఎక్కువగా తలకు, నరాలకు సంబంధించినవే ఉంటాయి. న్యూరో డాక్టర్ లేకపోవడంతో రోజుకు 35 వరకూ జరిగే ఎంఆర్ఐ స్కానింగ్‌లు 15 నుంచి 20లోపునకు తగ్గిపోయాయి. గతంలో సిటీస్కాన్‌లు ప్రతిరోజూ 50 నుంచి 60 వరకూ జరగ్గా ప్రస్తుతం 20 నుంచి 25కు పడిపోయిన పరిస్థితి ఉంది. రోగులకు మరిన్ని సేవలందించాల్సిన సర్వజన ఆసుపత్రి రోగులను దూరంగా నెట్టేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రయివేటు ఆసుపత్రులతో కుమ్మక్కై న్యూరోసర్జన్‌ను ఇక్కడ లేకుండా చేశారా అనే అనుమానాలు జనాల్లో నెలకొన్నాయి. కొత్తన్యూరో వైద్యులను నియమించకపోవడం, ఉన్న వైద్యుడిని పంపేయడం చూస్తే ప్రజల అనుమానాలకు బలం చేకూరుతోంది. సర్వజన ఆసుపత్రికి వచ్చే న్యూరో కేసులన్నీ ప్రస్తుతం ప్రయివేటు ఆసుపత్రులకే వెళ్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో సామాన్య ప్రజానీకంపై పెనుభారం పడుతోంది. కలెక్టర్ జోక్యం చేసుకుంటే తప్ప సమస్యకు పరిష్కారం దొరకదనే చర్చ సాగుతోంది. జిల్లా ఆసుపత్రి కాస్తా సర్వజన ఆసుపత్రిగా మారిన తర్వాత అక్కడ పనిచేసే ముఖ్య అధికారులంతా తాము ఇక్కడ ఎవరికీ సమాధానం చెప్పనవసరం లేదనే ధోరణిలోలో ఉన్నట్లు చర్చ సాగుతోంది. సూపరింటెండెంట్‌ను కలవాలన్నా పెద్ద ప్రహసనంగా మారింది. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తే తప్ప ప్రజలకు వైద్యసేవలు సరిగ్గా అందే పరిస్థితి లేదు. కొత్త న్యూరో వైద్యులను నియమిస్తారా.. లేక బదిలీ చేసిన డాక్టర్‌ను వెంటనే వెనక్కి రప్పిస్తారోగాని వెంటనే వైద్య సేవలు పునరుద్ధరించాలని జనం కోరుతున్నారు. జిల్లాలో మంత్రులు, ఎంఎల్‌ఎలు సైతం సర్వజన ఆసుపత్రి గురించి పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# వీడుతున్న మిస్టరీ..!

### డోర్ డెలివరీ డెడ్‌బాడీ పర్లయ్యదిగా గుర్తింపు

### రంగరాజు చిన్నఅల్లుడు శ్రీధర్‌వర్మ కోసం గాలింపు ముమ్మరం

### మృతుడు, ప్రధాన అనుమానితుడు నివాసం ఒకే గ్రామంలో

ప్రజాశక్తి - కాళ్ల, ఉండి

శ్రీధర్ వర్మ

డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసు మిస్టరీ వీడుతోంది. డెడ్‌బాడీ ఎవరిదనేది గుర్తించడంతో పోలీసులు మంచి పురోగతి సాధించారు. ఇప్పటి వరకూ మిస్టరీగా ఉన్న మృతుని వివరాలను ఎట్టకేలకు ఛేదించగలిగారు. పార్శిల్‌లో వచ్చిన మృతదేహం పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం గాంధీనగరానికి చెందిన బర్రె పర్లయ్య (40)దిగా గుర్తించారు. మృతుని మేనల్లుడు దుర్గారావు నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. పర్లయ్య కూలి పని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో భార్య వేరేగా ఉంటోంది. వీరికి ఇద్దరు కుమారులు. పర్లయ్య ఒక్కడే గాంధీనగరంలో ఉంటూ పనులు చేసుకుని జీవిస్తున్నాడు. డెడ్‌బాడీ డోర్ డెలివరీ అయిన గాదిరాజు రంగరాజు చిన్న అల్లుడు, ఈ కేసులో మొదటి నుంచి అనుమానితునిగా ఉన్న తిరుమాని శ్రీధర్‌వర్మ కూడా గాంధీనగరంలోనే నివాసం ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఇంట్లో ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో డెడ్‌బాడీని పంపిన చెక్కపెట్టె వంటిదే మరొకటి ఉండడంతో పోలీసులు ఖంగుతిన్నారు. కృష్ణా జిల్లాకు చెందిన తిరుమాని శ్రీధర్‌వర్మ అసలు పేరు సునీల్‌వర్మగా పోలీసులు భావిస్తున్నారు. కాళ్ల మండలం ఇస్కులంకకు చెందిన మహిళను మొదటి వివాహం చేసుకున్న వర్మ తర్వాత శ్రీధర్‌వర్మగా తన పేరు మార్చుకుని ఉండి మండలం యండగండికి చెందిన గాదిరాజు రేవతిని ప్రేమ పేరుతో మభ్యపెట్టి రెండో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత మరో యువతిని వివాహం చేసుకుని ఆమెను కాళ్ల మండలం గాంధీనగరంలో ఉంచినట్లు గుర్తించారు. శ్రీధర్‌వర్మతోపాటు ఆ యువతి సైతం అదృశ్యం కావడంతో ఆటో డ్రైవర్‌కు చెక్కపెట్టె పార్శిల్ అప్పగించింది ఆమెనని పోలీసులు అనుమానిస్తున్నారు. పార్శిల్ ఇచ్చిన మహిళ ఎర్రకారులో వచ్చిందని, ముఖానికి మాస్క్ పెట్టుకుని ఉన్నట్లు ఇప్పటికే పోలీసుల దర్యాప్తులో తేలింది. గాంధీనగరంలో నివాసం ఉంటున్న వర్మ మూడో భార్య బయటికి వచ్చినప్పుడల్లా ముఖానికి మాస్క్ పెట్టుకునే ఉంటుందని, వర్మకు ఎరుపురంగు కారు ఉందని స్థానికులు చెప్పడంతో ఈ హత్య, డోర్ డెలివరీ వెనుక ప్రధాన నిందితుడు వర్మేనని పోలీసులు భావించి ఆయన కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఇప్పటికే పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పర్లయ్యది హత్యేనని గుర్తించారు. ఆక్వా చెరువులు తీసుకునే వర్మ ఆ చెరువులపై పని పేరుతో పర్లయ్యను తీసుకెళ్లి హత్య చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రీధర్‌వర్మ వాడుతున్న మోటార్ సైకిల్, ఎరుపు రంగు కారు నంబర్లు నకిలీవని పోలీసులు గుర్తించారు. ఏదేమైనా ప్రధాన అనుమానితుడు శ్రీధర్‌వర్మ పట్టుబడితే ఈ కేసు మిస్టరీ పూర్తిగా వీడే అవకాశం ఉంది.

**శ్రీధర్‌వర్మ ఆచూకీ తెలపండి: ఎస్‌పి**

డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసులో ప్రధాన అనుమానితుడు తిరుమాని శ్రీధర్‌వర్మ (సిద్దార్థవర్మ) ఫొటో, అతడు ప్రయాణించిన ఎరుపు రంగు కారు ఫొటోలను జిల్లా ఎస్‌పి సోమవారం మీడియాకు విడుదల చేశారు. శ్రీధర్‌వర్మ ఆచూకీ తెలిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు.

## ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యతివ్వాలి

### జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. డివిజన్, మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలలా ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన 147 అర్జీలను కలెక్టర్ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్వీకరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్, మండల స్థాయిలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని పరిశీలించి, అధికారులకు జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. డివిజన్, మండలాలకు వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని, జిల్లా కలెక్టరేట్‌కు అర్జీలు సంఖ్య తగ్గుతోందని తెలిపారు. ఫిర్యాదులు స్వీకరించినప్పుడు ఫిర్యాదుదారులతో స్నేహపూరిత వాతావరణంలో ముఖాముఖిగా మాట్లాడినట్లయితే వారి సమస్య సగం తీరుతుందన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, డిఎల్‌డిఒ వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, అధికారులు పాల్గొన్నారు.

## హాస్టళ్ల మరమ్మతులు త్వరితగతిన పూర్తిచేయాలి

### కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

సంక్షేమ వసతి గృహాల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణి హౌసింగ్, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ శాఖల అధికారులతో సమావేశమై వసతి గృహాల మరమ్మతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలకు రూ.1.29 కోట్లు, బిసి హాస్టళ్లకు రూ.15 లక్షల చొప్పున తొలివిడత పరిపాలన ఆమోదం ఇవ్వడం జరిగిందన్నారు. హాస్టల్ విద్యార్థుల ఇబ్బందులను తొలగించే దిశగా ముందుగానే గృహ నిర్మాణ శాఖకు ఆదేశాలిచ్చి హాస్టళ్లకు మరమ్మతులు ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 51 వసతి గృహాలు ఉన్నాయని, వాటిలో ఎస్‌సి 35, ఎస్‌టి రెండు, బిసి 29 తెలిపారు. అలాగే ఎస్‌సి 29, బిసి 10, ఎస్‌టి 1 మొత్తం 40 హాస్టళ్లకు సొంత భవనాలు ఉన్నాయన్నారు. హాస్టళ్లలో స్లాబ్, మరుగుదొడ్లు తదితర పనులు చేపట్టి పూర్తి చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ హరిహరనాథ్, ఇఇ బి.పిచ్చయ్య, బిసి సంక్షేమ శాఖ అధికారి జివిఆర్‌కెఎస్ ఎస్.గణపతిరావు, ఎస్‌టి వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, ఇన్‌ఛార్జి ఎస్‌సి వెల్ఫేర్ అధికారి బివిఎస్‌బి రామాంజనేయ రాజు పాల్గొన్నారు.

**ఆర్గానిక్ ఉత్పత్తులను వినియోగించాలి**

ఆరోగ్యకరమైన జీవనానికి ప్రకృతి వ్యవసాయ (ఆర్గానిక్) ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వనరుల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ నాగరాణి, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. జిల్లాలో 14 మంది రైతులు తీసుకొచ్చిన వివిధ రకాలు కూరగాయలు, ఆర్ఎన్ఆర్ (షుగర్ లెస్), నవరా, కుచిపడాలియా, సిద్ధి సన్నాయి, చిట్టిముత్యాలు, సాంబ మసూరి, రత్నం చోడి, కులాకార్ 8 రకాల బియ్యాన్ని, పసుపు, కారం, వివిధ రకాల కూరగాయలు, పండ్లు తదితరాలను కలెక్టర్, జెసి పరిశీలించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రజలు వినియోగించుకుని ఆరోగ్యమైన సమాజ నిర్మాణానికి అడుగులు వేయాలన్నారు. రైతు సోదర, సోదరీమణులకు అందరికీ జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు, జిల్లా కోఆర్డినేటరు ఎం.అరుణకుమారి పాల్గొన్నారు.

## విద్యుత్ ఛార్జీల పెంపు దారుణం

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీతారాం

ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమనే హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో భారం మోపి ప్రజలను మోసగించడం దారుణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ రకరకాల ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందన్నారు. గతంలో వినియోగించుకున్న విద్యుత్‌కు ప్రస్తుతం ఛార్జీలు విధించడం సమంజసం కాదన్నారు. కూటమి ప్రభుత్వం లేనిపోని హామీలిచ్చి అధికారం చేపట్టి ప్రజలను అన్నివిధాలా మోసం చేసిందని విమర్శించారు. తక్షణం విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకూ నేషనల్ హైవేలపై టోల్ బాదుడు చూశామని, కూటమి ప్రభుత్వం రాష్ట్ర రహదారులపై కూడా టోల్ ఛార్జీలను వసూలు చేయడం దుర్మార్గమైన చర్య విమర్శించారు. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 3, 4, 5 తేదీల్లో సిపిఎం జిల్లా 26వ మహాసభ భీమవరంలో జరుగుతున్నట్లు తెలిపారు. 3వ తేదీన వేలాది మందితో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలిపారు. బహిరంగ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమా మహేశ్వరరావు, మంతెన సీతారాం హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ మహాసభ నిర్వహణకు పట్టణంలోని పెద్దలు, ప్రముఖులు, వ్యాపార వర్గాలు, అధికారులు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, బురుడు వాసుదేవరావు, కేతా గోపాలన్, పివి.ప్రతాప్, బి.కళ్యాణి. కర్రినాగేశ్వరరావు పాల్గొన్నారు.

## దర్భరేవు లాకుల మరమ్మతులు చేపట్టాలి

### సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

మండలంలోని దర్భరేవు లాకులకు మరమ్మతులు చేపట్టాలని ఎల్‌బి.చర్ల గ్రామానికి చెందిన రైతులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. లాకుల నిర్వహణ గాలికి విడిచిపెట్టడం వల్ల ఏటా సార్వా పంట నష్టపోతున్నామన్నారు. ఎమిదేళ్ల పాటు మొదటి పంటను కోల్పోతున్నామన్నారు. పంట పొలాల్లోని ముంపు నీరు బయటకు వెళ్లకపోవడం వల్ల దాళ్వా పంటను కూడా వదులుకోవాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి లాకుల నిర్వహణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ దాసిరాజుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కటకంశెట్టి మాణిక్యాలరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రతాప్ పాల్గొన్నారు.

## సరిపల్లిలో ప్రతాప్‌నాయుడు అంత్యక్రియలు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతాప్‌నాయుడు అంతిమయాత్రలో పాల్గొన్న నేతలు, ప్రజలు

మాజీ ఎంఎల్ఎ బందారు మాధవనాయుడు తండ్రి వీర సూర సత్యప్రతాప్ నాయుడు అంతిమయాత్ర సోమవారం ఆయన స్వస్థలం మండలంలోని సరిపల్లి గ్రామంలో జరిగింది. ఆయన అంతిమయాత్రలో గ్రామస్తులతో పాటు నియోజకవర్గంలో పలు పార్టీల నేతలు పాల్గొన్నారు. విప్, ఎంఎల్ఎ నాయకర్, మైనార్టీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎం.ఎ.షరీఫ్, మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్నా) పాడి మోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. తొలుత పలువురు నాయకులు ఆయన భౌతికకాయాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. బందారు మాధవ నాయుడు కుమారుడు చేతన్ విదేశాల్లో ఉండటంతో దహన సంస్కారాలు సోమవారం నిర్వహించారు. ఎంఎల్‌సి వంకా రవీంద్రతో పాటు జిల్లాకు చెందిన వివిధ పార్టీ నాయకులు మాధవ నాయుడును పరామర్శించారు.

## పాలకొల్లులో చిరు జల్లులు, చలిగాలులు

**పాలకొల్లు:**వాయుగుండం ప్రభావంతో పాలకొల్లులో సోమవారం ఉదయం నుంచి వాతావరణం పూర్తిగా మేఘావృతమై చలిగాలులు వీస్తున్నాయి. సాయంత్రం చలిగాలులకు తోడు చిరు జల్లులు పడ్డాయి. మారిన వాతావరణంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇంకా ఖరీఫ్ మసూళ్లు 10 నుంచి 20 శాతం ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో రబీ నారుమడులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో నారుమడులు, నాట్లు వేసుకునే వారికి వర్షపు నీరు అవసరం ఉంటుంది. ఈ సారి వాతావరణం చూస్తుంటే ఏదో ముప్పు తెచ్చేలా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## క్రిస్మస్ సందడి

తాడేపల్లిగూడెం : విద్యుద్దీపాలతో ముస్తాబైన క్రైస్ట్ లూథరన్ ఏ క్లాస్ పేరిస్ చర్చి

నరసాపురం : విద్యుత్ అలంకరణలో లూథరన్ చర్చి

## అమిత్‌షా హోం మంత్రి పదవికి అనర్హుడు

### సిపిఎం నాయకుల నిరసన

ప్రజాశక్తి - పెనుమంట్ర

అమిత్‌షా కేంద్ర హోంమంత్రి పదవికి అనర్హుడని స్థానిక సిపిఎం నేతలు అన్నారు. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో బ్రాహ్మణ చెరువులో నేతలు నిరసన తెలిపారు. అంబేద్కర్‌ను కించపర్చిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ డిమాండ్ చేశారు. ముందుగా తెన్నేటి ఆంజనేయులు, జోగి విఘ్నేశ్వరుడు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమిత్‌షా క్షమాపణ చెప్పాలని, ప్రధాని మోడీ వెంటనే స్పందించి ఆయనపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కె.సుబ్బరాజు, కె.వెంకటేశ్వరరావు, కె.రాము, డి.శ్రీను, కె.శ్రీను, ఉండ్ర అప్పన్న, జె.యగన్న పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్, జెసి

## ఛాంపియన్‌షిప్ విజేతలకు అభినందన

ప్రజాశక్తి - భీమవరం

ఈనెల 5వ తేదీన తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో నిర్వహించిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో విజేతలుగా నిలిచిన తణుకు మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులను సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి విజేతలను అభినందించి పతకాలు గెలుపొందిన విజేతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని కలెక్టర్ తెలిపారు. ఇన్ లైన్ హాకీ కాడెట్ అండర్-11 విభాగంలో మైత్రి దాస్ బంగారు పతకం, రోలర్ మిక్స్ హాకీ కాడెట్ అండర్-11 విభాగంలో కె.నితేష్ గౌడ్ క్యాంస పతకం, రోలర్ మిక్స్ హాకీ సబ్ జూనియర్ అండర్-14 విభాగంలో జి.జస్వంత్ క్యాంస పతకాలను సాధించారు. జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, మాంటిస్సోరి స్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.జ్యూల మంజరి, ఆంధ్రప్రదేశ్ టీమ్ కోచ్ ఎ.భార్గవ్, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ నందమూరి రాజేష్, జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఉన్నారు.

## గణితంపై పట్టు సాధించాలి

**పాలకొల్లు :** పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే కచ్చితంగా కంప్యూటర్ స్కిల్స్ నేర్చుకోవాలని, గణితంపై పట్టు సాధించాలని వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ అన్నారు. స్థానిక శ్రీదేవిపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాలలో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రఖ్యాత భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ టి.కృష్ణ వ్యవహరించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, అధ్యాపకులు మొదటిగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్రను, ఆయన చేసిన గణిత పరిశోధనలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యాసరచన పోటీలోని విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. థర్డ్ సెమిస్టర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర అధ్యాపకులు కె.శివకృష్ణ, బికెవి.రామలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

**ఆచంట :** రైతుల పట్టాదారు పాస్ పుస్తకాల కోసం ఆందోళన చెందవలసిన అవసరం లేదని, 1బి అడంగులలో ఆన్‌లైన్‌లో పేరు మారితే సరిపోతుందని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. సోమవారం ఆచంట మండలం కందరవల్లి, కరుగోరుమిల్లి గ్రామాలలో ఆయా సర్పంచులు బోడపాటి బుల్లయ్య, అల్లం పద్మావతి అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం పాస్ పుస్తకాల జారీ ప్రక్రియను ప్రారంభించిందన్నారు. భూ బదలాయింపులు కాకుండా ప్రతి ఒక్కరూ భూములను విక్రయించిన, ఇతర కారణాలతో బదలాయింపు చేసిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, సిద్ధాంతం వాటర్ డిస్ట్రిబ్యూషన్ ఛైర్మన్ తమ్మినీడి ప్రసాద్, కేతా మీరయ్య, జవ్వాది బాలాజీ శ్రీనివాస్, ఎఒ బి.నాగరాజు పాల్గొన్నారు.

**ఉండి:** ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు ఉండి మండల తహశీల్దార్ కె.నాగార్జున తెలిపారు. సోమవారం ఉండి మండలం కలిసిపూడి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న నాగార్జున మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో ఆరుగురు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అప్పారావు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ మరలా మరలా అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్‌పి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా అదనపు ఎస్‌పి(అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**నరసాపురం:** ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు అధికారులను ఆదేశించారు. నరసాపురం సబ్ కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 34 ఫిర్యాదులు వచ్చాయని ఆర్‌డిఒ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన ఆర్‌డిఒ వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి చెరుకువాడ రైల్వేగేట్ మూసివేత

**ఉండి :** ఈనెల 24వ తేదీ నుంచి చెరుకువాడ రైల్వే గేట్‌ను పది రోజుల పాటు రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే ట్రాక్ మరమ్మతు నిమిత్తం నేటి నుంచి జనవరి రెండో తేదీ సాయంత్రం 6 గంటల వరకు రైల్వే గేటును మూసివేస్తున్నామని, వాహనదారులు, ప్రయాణికులు తమకు సహకరించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

# ఆ నీరు తాగేదెలా..

### కానుపోతుగుంటలో రంగుమారిన తాగునీరు
### లబోదిబోమంటున్న గ్రామస్తులు

కానుపోతు గుంటలో రంగుమారిన తాగునీరు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో పైప్ లైన్ల ద్వారా మురుగునీరు సరఫరా కావడంతో ఆయా ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆచంట పంచాయతీ పరిధి కానుపోతు గుంటలో కుళాయిలు వదిలే ముందు మురుగునీరు వస్తుందని, ఆ నీరు తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నామని స్థానికుల బండి రంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకోరకంగా కలుషితమైన నీరు, కంకర రంగు, పసర్ల రంగు, పసుపు రంగు, ఎరుపు రంగు రూపాలలో కుళాయిలు వదిలేముందు మురుగునీరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మురుగు నీరు ద్వారా 90 శాతం రోగాలు కలుషిత నీరు తాగడం వల్లే వస్తున్నాయని పదే పదే వైద్యులు తెలిపినా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరడంతో ఈ పరిస్థితి దాపురిస్తుందని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. ఆ గ్రామంలో సుమారు 250 కుటుంబాలు మంచినీటి కోసం అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో ఆ గ్రామంలో బోరువేసిన నీరు రాదని, దీంతో పంచాయతీ అధికారులు సరఫరా చేసే మంచినీరు ఆ గ్రామస్తులకు ఆధారం. మాజీ ఎంఎల్ఎ రంగనాథరాజును ఎన్నికలకు ముందు మంచినీరు కావాలని అడగగా, మీ గ్రామానికి ప్రత్యేకమైన పైపులైను వేస్తామని హామీ ఇచ్చారు కానీ ఆ హామీ నెరవేరకుండానే ఆయన ఓటమి పాలయ్యారు. ఈ సమస్య గత పదారు సంవత్సరాల నుంచి ఉత్పన్నం అవుతున్నా, ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పైపులైన్ల మరమ్మతులు చేపట్టి, సురక్షితమైన మంచినీటి సరఫరా చేయాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజా దర్బార్‌లో సమస్యలు పరిష్కారం : ఎంఎల్ఎ పితాని

**పెనుగొండ:** ప్రజా దర్బార్‌లో పెనుగొండలోని ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం మేజర్ పంచాయతీలో పితాని మాట్లాడుతూ ప్రజా దర్బార్లో సమస్యల పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, నిరుపేదలకు ఇళ్ల స్థలాలకు భూములు సమీకరించి రెండున్నర సెంట్లు ఇస్తామని, కొత్త రేషన్ కార్డులకు ఇప్పటికే ప్రక్రియ జరుగుతుందన్నారు. వృద్ధాప్య పెన్షన్లు అందిస్తామని, జగనన్న కాలనీలో రోడ్లు నిర్మిస్తామని, పెనుగొండలోని పంచాయతీల్లో చెత్తకుప్పలపై ఫిర్యాదులు వెలువడ్డాయని, గ్రామ సర్పంచి ఉండే రూమును పెయింటింగ్‌లు వేయాలని, సర్పంచుల విలువలను కాపాడాలని కార్యదర్శులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి శ్యామలా సోనీ శాస్త్రి, ఎండిఒ సూర్యనారాయణ పాల్గొన్నారు.



వంశీకృష్ణమరాజును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంఎల్ఎ

## టిడిపిలోకి కుముదవల్లి సర్పంచి వంశీకృష్ణంరాజు

**పాలకోడేరు :** కుముదవల్లి గ్రామ సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు భూపతి రాజు వంశీకృష్ణంరాజు టిడిపిలో చేరారు. పెదఅమిరం టిడిపి కార్యాలయంలో ఉండి ఎంఎల్ఎ, రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు వంశీకృష్ణంరాజుకు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పంచాయతీ పాలకవర్గం సభ్యులతో పాటు వంశీకృష్ణంరాజు ఆధ్వర్యంలో రఘురాంకృష్ణంరాజు సారథ్యంలో టిడిపి జెండా కప్పుకున్నారు. రమేష్ రాజు, కటారి నవీన్, భూపతి రాజు రవిరాజు, సాగి సుబ్బరాజు, బాపిరాజు, భూపతిరాజు సుబ్రహ్మణ్యం రాజు, పెనుమత్స రామకృష్ణంరాజు, భూపతి రాజు ప్రసాద్, వెంకన్న, బండారు పెద్ది, నరేష్, ఏసు, సత్యానందం, యలమంచిలి అంజి, భాష, శివకృష్ణ, పెనుమత్స గోపి, కోకలపాటి బంగారు రాజులు సుమారు 150 మంది టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా సర్పంచి వంశీకృష్ణంరాజు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. రఘురామకృష్ణంరాజు సారథ్యంలో టిడిపిలోకి చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఎంఎల్ఎ వెంట నడుస్తామని చెప్పారు.

## జెడ్‌పి పాఠశాల సందర్శన

**మొగల్తూరు:** విద్యార్థులకు నాణ్యమైన విద్యుతోపాటు రుచికరమైన ఆహారం కూడా ప్రభుత్వం అందిస్తుందని ముత్యాలపల్లి గ్రామ సర్పంచి అడ్డాల సూరిబాబు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించి, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులు ఆరా తీశారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామరాజు, పిఎంసి ఛైర్మన్ కొల్లాటి సులేమాన్, పంచాయతీ కార్యదర్శి ఎం.సత్యనారాయణ ఉన్నారు.

## 29న రజక వృత్తిదారుల పట్టణ మహాసభ

**భీమవరం టౌన్:** ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం భీమవరం పట్టణ మహాసభ ఈనెల 29న ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరుగుతుందని, ఈ కార్యక్రమానికి రజక వృత్తిదారులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి మడక రాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం భీమవరంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు మడక రాజు మహాసభల ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్ విచ్చేస్తున్నారన్నారు. మహాసభల్లో ప్రధానంగా గ్రామాల్లో నెలకొన్న రజక వృత్తి చెరువుల సమస్యలు, రజకులపై దాడులు దౌర్జన్యాలు, 50 ఏళ్ల నిండిన వృత్తిదారులకు పింఛన్లు, లాండ్రీషాపులకు ఉచిత కరెంటు హామీ తదితర అంశాలు, సమస్యలపై సుదీర్ఘంగా చర్చిస్తామన్నారు. అనంతరం మహాసభల కరపత్రాలు రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యండమూరి నాగేంద్ర, సంఘం నాయకులు దొడ్డిపట్ల అమ్మారావు, మల్లిపూడి వెంకటేశ్వరరావు, తలుపురి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

భీమవరం టౌన్: వేడుకలో విద్యార్థులు, ప్రిన్సిపల్

**భీమవరం టౌన్:** స్థానిక రెండవ పట్టణంలోని ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సోమవారం కిసాన్ దివాస్(జాతీయ రైతు దినోత్సవం) వేడుకలు ఘనంగా జరిగాయని స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణంరాజు తెలియజేశారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ భారతదేశ ఆర్థికవ్యవస్థకు వెన్నుముక, గ్రామీణ శ్రేయస్సుకు సహకారి రైతులు అన్నారు. అటువంటి రైతులను గౌరవించడం కోసం ప్రతి సంవత్సరం డిసెంబర్ 23న జాతీయ రైతు దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. భారతదేశ 5వ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతి జ్ఞాపకార్థం ఈ రోజును జాతీయ రైతు దినోత్సవం జరుపుకుంటున్నామని తెలియజేశారు. స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయం చేసి ఆహారాన్ని ముడి సరుకును పండించే వ్యక్తిని రైతు' అంటారని, అన్నం తినేటప్పుడు ఆ దేవుడికి మొక్కడమే కాదు, తన రక్తాన్ని పారించి ఆ అన్నం ముద్ద మన నోట్లోకి పోవడానికి కారణమైన ఆ రైతన్నకి కూడా ఒకసారి మన కరతాళ ధ్వనుల ద్వారా శుభాకాంక్షలు తెలియజేస్తూ నమస్కరించుకుందామని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కొందరు విద్యార్థులు రైతుల వేషధారణలో అందరినీ అలరించారు. రి.యుగ సుద్ధ, కెవి.సత్యనారాయి, ఎఎల్‌యు.దుర్గాంబ పాల్గొన్నారు.

**నరసాపురం:** మండలంలోని వేములదీవి పడమర పంచాయతీ గొందిమూల గ్రామం మండల పరిషత్ స్కూల్‌లో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం యు.రాజశ్రీ విద్యార్థులచే రైతు బిడ్డ వేషధారణ చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ రైతు దేశానికే వెన్నుముఖ అన్నారు. రైతుల్ని మనం ఎప్పుడూ గౌరవించాలన్నారు. రైతు చేసే పనుల్ని విద్యార్థులకు వివరించారు.

## 9 మందికి సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గంలో పేద ప్రజలకు సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన తొమ్మిది మంది బాధితులకు ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు రూ.9 లక్షల 42 వేల 611లు పోడూరు మండలం కొమ్ముచిక్కాలలో సోమవారం అందజేశారు. పెనుమంట్ర మండలానికి చెందిన పడాల మాణిక్యం రూ.లక్ష 22 వేల 323, ఓడూరు గ్రామానికి చెందిన వి.లక్ష్మి రూ.లక్ష 54 వేల 346, వెలగలేరు గ్రామానికి చెందిన పడాల సూర్యనారాయణ రెడ్డి రూ.45 వేలు, ఆచంట మండలం కొడమంచిలి గ్రామానికి చెందిన నున్నబోయిన నాగరాజు రూ.80 వేల 967, నెక్కంటి సూర్యకుమారి రూ.2 లక్షల 92 వేల 54, బాలవారి పాలెం గ్రామానికి చెందిన బండారు సుబ్రహ్మణ్యం రూ.3 లక్షల 19 వేల 551, ఆచంట వేమవరం గ్రామానికి చెందిన వేలిచేటి సూర్యనారాయణ రూ.లక్ష 80 వేల 413, కవిటం గ్రామానికి చెందిన చింతాడ నిరూపమకు రూ.3 లక్షల 26 వేల 864, చిన్న మల్లాం గ్రామానికి చెందిన గుడాల లక్ష్మికి రూ.లక్ష 880 చెక్కులను ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు నీటి సంఘం ఉపాధ్యక్షులు తేతలి వెంకటరామరెడ్డి, బాలం రమణ, మాజీ సర్పంచి సత్యనారాయణ మూర్తి, ఆలమూరు నీటి సంఘం అధ్యక్షులు ఇందుకూరి వెంకట నరసింహ రాజు( చెరుకువాడ రాజు) పాల్గొన్నారు.

## క్రిస్మస్ అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలి

### జిల్లా పౌర సంబంధాల అధికారి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

త్యాగం, దయ, శాంతి వంటి గుణాలు ఇతరుల పట్ల కలిగి జీవించడమే నిజమైన క్రిస్మస్ అని, క్రిస్మస్ పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని జిల్లా పౌర సంబంధాల అధికారి టి.నాగేశ్వరరావు ఆకాంక్షించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో పౌర సంబంధాల కార్యాలయంలో సెమి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఆర్ఒ టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ చాలా ప్రత్యేకమైనదని, ఏ మతమైనా విశ్వశాంతినే బోధిస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ వివిధ పనుల ఒత్తిళ్లతో కూడుకుని జీవిస్తున్నారని, అందరినీ కలుపుకొని ఒక సమాజంగా ఏర్పరచడంలో ఇటువంటి పర్వదినాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. తొలుత రికార్డ్ అసిస్టెంట్ దేవరకొండ సోమరాజుతో కేకును కట్ చేయించి డిపిఆర్ఒ, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలలో సీనియర్ అసిస్టెంట్ కెటియంకె సత్యనారాయణ రాజు, పబ్లిసిటీ అసిస్టెంటు చించిలి శ్రీనివాస నెహ్రూ, రికార్డ్ అసిస్టెంట్ దేవరకొండ సోమరాజు, ఫొటోగ్రాఫర్ పివై.రత్నాకర్, టెక్నికల్ సబ్ఆర్డినేట్ పి.వీరభద్రం పాల్గొన్నారు.

కాళ్ల : ఏలూరుపాడులో క్రిస్మస్ వేడుకలు

**కాళ్ల :** యేసుక్రీస్తు ప్రవచించిన ప్రేమ, కరుణ, శాంతి అనే సుగుణాలను పాటిస్తే అందరి జీవితాలు సుఖశాంతులతో ఉంటాయని కలవపూడి గ్రామ సర్పంచి గేదల జాన్ పేర్కొన్నారు. ఏలూరుపాడు గ్రామంలో జీసస్ క్రైస్ట్ ప్రేయర్ మినిస్ట్రీస్ చర్చిలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఎండి ఇస్మాయిల్ మాట్లాడుతూ ప్రేమ, సామరస్య సందేశాన్ని వ్యాప్తి చేసేందుకు ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారన్నారు. ఏసుక్రీస్తును ఆరాధిస్తూ, ప్రార్థనలు చేస్తూ, గీతాలాపనలు చేశారు. క్రిస్మస్ ప్రాముఖ్యత ఏసుక్రీస్తు బోధనల గురించి సందేశం ఇచ్చారు. ఈ క్రిస్మస్ వేడుకలకు ఏలూరుపాడు, కాళ్లకూరు, జువ్వలపాలెం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున క్రైస్తవ భక్తులు వచ్చారు. 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం క్రిస్మస్ వేడుకలకు విచ్చేసిన వారికి ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిసిపిఎ ప్రెసిడెంట్ ఎండి ఇస్మాయిల్, ఎఐసిఎఫ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజకుమార్, పాస్టర్లు ఐజయ్య, జి.రవికుమార్ పాల్గొన్నారు.

భీమవరం : కేక్ కట్ చేస్తున్న పౌర సంబంధాల శాఖ అధికారులు

## వైఎన్ ప్లాటినం జూబ్లీ వేడుకలకు పురంధేశ్వరి

ప్రజాశక్తి - నరసాపురం



పురందేశ్వరికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న వైఎన్ కళాశాల యాజమాన్యం

శ్రీవైఎన్ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు కళాశాల కోశాధికారి పోలిశెట్టి శ్రీరఘు రామారావు ఎంపీ, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని కలిసి ఆహ్వానం అందించారు. సోమవారం రాజమండ్రిలోని ఆమె కార్యాలయంలో కలిసి 2025 జనవరి 11వ తేదీన జరిగే వేడుకలకు సంబంధించిన కార్యక్రమాలను వివరించారు. ఈ వేడుకలకు హాజరు కావడానికి పురందేశ్వరి సుముఖత వ్యక్తం చేసారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకరావు, డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ అరిపిరాల నారాయణరావు పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

## బంగారు వస్తువుల వ్యాపారం పేరుతో మోసం

### ముద్దాయి అరెస్ట్

**తాడేపల్లిగూడెం :** పట్టణంలో బంగారం వస్తువుల వ్యాపారం చేస్తూ మోసాలకు పాల్పడిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం డిఎస్‌పి విశ్వనాథ్ తెలిపారు. సోమవారం సాయంత్రం పట్టణ సిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక శేషమహల్ రోడ్‌లో ఉన్న మాన్వి జ్యువెలర్స్ అధినేత లంక రమణబాబు నరసాపురానికి చెందిన అనిల్ కుమార్ జైన్ అనే వ్యక్తి వద్ద నుంచి తక్కువ ధరకే ఆభరణాలు తయారు చేస్తానని నమ్మించి, అతని వద్ద నుంచి రూ.12,46 గ్రాముల బంగారం, రూ.1,08,500 నగదు తీసుకుని పరారైనట్లు ఈనెల 16వ తేదీన తాడేపల్లిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం సుమారుగా 33 మంది బాధితులు తమ వద్ద కూడా బంగారం, వెండి తీసుకుని మోసం చేసినట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు అతని పై కేసు నమోదు చేసి పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ నాగరాజు, సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అతన్ని, భార్య కృష్ణ ప్రియాంకను అరెస్టు చేసి 6,788 గ్రాముల బంగారం, 106,772 గ్రాముల వెండి, రూ. 3 లక్షల నగదు, కియో సెలెటస్ కారును స్వాధీన పరుచుకున్నట్లు డిఎస్‌పి విశ్వనాథ్ తెలిపారు. ముద్దాయిలను కోర్టుకు హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకొని ముద్దాయిని అరెస్ట్ చేసిన పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ నాగరాజు, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

### రూ.60 వేల నగదు, బంగారం, వెండి వస్తువుల అపహరణ

**నరసాపురం:** నరసాపురంలో సోమవారం పట్టపగలు తాళం వేసిన ఇంటి తలుపు పగలగొట్టి చోరీ చేశారు. బాధితురాలు కథనం ప్రకారం వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న లక్కు లక్ష్మి ఇంటిలో రూ.60 వేలు నగదు, 8 గ్రాముల బంగారం ఉంగరాలు, సుమారు 50 గ్రాముల విలువ చేసే వెండి వస్తువులు అపహరించుపోయారు. చోరీ జరిగిన సమయంలో బాధితురాలు ఆస్పత్రికి వెళ్లింది. దొంగ తలుపు పగలకొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో శబ్దాలు వస్తుండటంతో చుట్టుపక్కల వారు అనుమానం వచ్చి బయటకు రాగా దొంగ పారిపోవడాన్ని గమనించారు. పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ చిక్కలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించారు. ఈ సంఘటనా స్థలాన్ని ఎస్.ముత్యాలరావు పరిశీలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

TADEPALLIGUDEM MUNICIPALITY
"e" Procurement Tender Notice

Roc.No.2422/E1/2023-24 Dated.23.12.2024

| Sl. No. | Name of the Work | Name of the Grant | Estimate Value (Rs in Lakhs) | Bid Downloading Start Date | Last Date for Receipt of Bids |
|---|---|---|---|---|---|
| 1. | Providing Reparis Tractor Trucks belonging to Tadepalligudem Municipality | General Funds | 12.80 | 24.12.2024 | 30.12.2024 |

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit web site https://tender.apreprocurement.gov.in

Sd/- Commissioner
Tadepalligudem Municipality.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 307/2023
బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
అండ్
మిద్దే రామచంద్రరావు అండ్ అనదర్ ప్రతివాది -ప్రతివాదులు
సమన్స్ టు:
D-1: మిద్దే రామచంద్రరావు, S/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం. 3-57, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేములు సూర్యవంశీధర్, S/o. చంద్రశేఖర్, డోర్ నెం. 4-109, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 26-12-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 23-12-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 239/2023
బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
అండ్
కట్టా శ్రీనివాసబాలాజి అండ్ అనదర్ ప్రతివాది -ప్రతివాదులు
సమన్స్ టు:
D-1: కట్టా శ్రీనివాసబాలాజి, S/o. వెంకటరావు, డోర్ నెం. 4-12, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల అశ్వనికుమార్, S/o. భాస్కరరావు, డోర్ నెం. 4-65, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 26-12-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 23-12-2024 సెల్: 98662 59514

## రూ.44 లక్షలతో రహదారుల మరమ్మతులు : ఎఇ

**గణపవరం:** మండలకేంద్రమైన గణపవరంలో సోమవారం ఆర్అండ్‌బి అధికారులు రోడ్డు మరమ్మతులను చేపట్టారు. ఈ సందర్భంగా ఎఇ కె.రవి బాబు మాట్లాడుతూ రూ.44 లక్షలతో రోడ్డు మరమ్మతులు చేపట్టినట్టు చెప్పారు. మండలంలో మొయ్యేరు నుంచి చింతలపాడు వరకూ రోడ్డు మరమ్మతులకు రూ.10 లక్షలు, గణపవరం, పిప్పర రహదారికి రూ.20 లక్షలు, చేబ్రోలు రహదారికి రూ.14 లక్షలు మొత్తం రూ.44 లక్షలతో రోడ్డు మరమ్మతులు చేపట్టినట్టు తెలిపారు.

## ఫ్రైడే డ్రైడే పాటించాలి

**తాడేపల్లిగూడెం :** ఆరోగ్య నియమాలను పాటిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా పాటించుట ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు సూచించారు. సోమవారం పట్టణ ఆరోగ్య కేంద్రం ఎన్‌టిఆర్ జంక్షన్, కడకట్ల పరిధిలోని 27, 9 వార్డుల్లో నిర్వహించిన ఆరోగ్య కార్యక్రమాల్లో భాగంగా అవగాహనా కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికొకసారి ఫ్రై డే డ్రై డే పాటించినట్లయితే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు కనకరత్నం, వెంకటలక్ష్మి, ఆశాలు సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్యాన్నదానానికి విరాళం

**భీమవరం టౌన్:** శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి శాశ్వత నిత్యాన్నదానానికి ఉండి గ్రామానికి చెందిన మారెళ్ల నరసింహారావు పేరు మీద వారి భార్య రుక్మిణి నాగమేశ్వరి, కుమార్తె కమల గాయత్రీ రూ.1,01,116(లక్ష వేయి నూట పదహారు) విరాళంగా సోమవారం ఆలయ ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్‌కు అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలియజేశారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 112/2020
బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది
అండ్
వేముల వెంకటలక్ష్మి అండ్ అనదర్ ప్రతివాది -ప్రతివాదులు
సమన్స్ టు:
D-1: వేముల వెంకటలక్ష్మి, W/o. వర్ధనరావు, డోర్ నెం. 4-105, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: వేముల వర్ధనరావు, S/o. చిరంజీవి, డోర్ నెం. 4-105, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా ది. 27-12-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.
మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 23-12-2024 సెల్: 98662 59514

వేలం ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) భీమవరం వారి కోర్టులో
E.P.No.6/2021
in O.S.No.231/2015
Between:
పాకలపాటి సూర్యనారాయణ ...DHR/వాది
Vs
ప్రగాడ సాయి కుమారి మరియు వగైరాలు ...JDR/ప్రతివాది
పై నెంబరు E.P గ్రంథంలో ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని ది.20-01-2025 సం॥ తేదీన పైకోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయబడును. వలయువారు వేలం పాటలో పాల్గొని సదరు ఆస్తిని పాడుకొనవచ్చును.
షెడ్యూల్
Item No.1 :
పశ్చిమ గోదావరి జిల్లా, గునుపూడి సబ్ రిజిస్ట్రి, పాలకోడేరు మండలం, విస్సాకోడేరు గ్రామ పంచాయతి ఏరియాలోని, విస్సాకోడేరు గ్రామం, రి.స.నెం.256/2A లో చిత్తు ప్లాను నెం.9, ఉత్తరం వైపు య.2-13 సెంట్లులో ఉత్తరం వైపు సగం య.1-06 1/2 సెంట్లులో చ.గ.175.25 స్తలంకు హద్దులు : తూర్పు: ప్లాట్ నెం.8 స్తలం 41 అ. దక్షిణం: 20 అడుగుల వెడల్పు గల ఉత్మడి మార్గం 37.9 అ. పడమర : ప్లాట్ నెం.10 స్తలం 41 అ, ఉత్తరం : గాదిరాజు సత్యనారాయణ రాజు గారి భూమి 38.9 అ.
పై హద్దుల మధ్య చ.గ.174.25 స్తలం మరియు సమస్త హక్కులతో సహా.
పై Item No.1 DHR విలువ Rs.2,50,000/-
అమినా విలువ Rs.6,40,000/-
Item No.2 :
పశ్చిమ గోదావరి జిల్లా, గునుపూడి సబ్ రిజిస్ట్రి, పాలకోడేరు మండలం, విస్సాకోడేరు గ్రామ పంచాయతి ఏరియాలోని, విస్సాకోడేరు గ్రామం, రి.స.నెం.256/2A లో చిత్తు ప్లాను నెం.5, ఉత్తరం వైపు య.2-13 సెంట్లులో ఉత్తరం వైపు సగం య.1-06 1/2 సెంట్లులో చ.గ.175.07 స్తలంకు హద్దులు : తూర్పు: ప్లాట్ నెం.4 స్తలం 43 అ. దక్షిణం: 20 అడుగుల వెడల్పు గల ఉత్మడి మార్గం 36.6 అ. పడమర : ప్లాట్ నెం.6 స్తలం 42.9 అ, ఉత్తరం : గాదిరాజు సత్యనారాయణ రాజు గారి భూమి 37.0 అ.
పై హద్దుల మధ్య చ.గ.175.07 స్తలం మరియు సమస్త హక్కులతో సహా.
పై Item No.2 DHR విలువ Rs.2,50,000/-
అమినా విలువ Rs.6,45,000/-
Item No.1 and 2 DHR విలువ Rs.5,00,000/-
Item No.1 and 2 అమినా విలువ Rs.12,85,000/-
అల్లూరి వెంకటేశ్వరరాజు
ప్రాంతం : భీమవరం తరపు అడ్వకేట్,
తేది.21-12-24 భీమవరం.